సాక్షి
బాపట్ల
శనివారం, 23, ఆగస్టు, 2025



కనకదుర్గమ్మకు బోనాలు

రెంటచింతల: మండలంలోని పాలువాయి జంక్షన్ శివదుర్గ కాలనీలో కనకదుర్గ అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. భక్తులు తరలివచ్చారు.



అనాథలు, వృద్ధులకు అన్నదానం

మాచర్ల: పట్టణంలోని అనాథలు, వృద్ధులకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బూర్గులమ్మకు ప్రత్యేక పూజలు



రేపల్లె: శ్రావణ మాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకుని గ్రామ దేవత బూర్గులమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

స్త్రీశక్తి పథకం సజావుగా జరుగుతుంది

ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు



బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం సజావుగా జరుగుతుందని ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆర్టీసీ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన బాపట్ల డిపో, గ్యారేజీలను సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఉచిత బస్సు సర్వీస్‌ల గురించి పక్క రాష్ట్రాలలో అధ్యయనం చేసి కొద్దిపాటి పొరపాట్లు కూడా దొర్లకుండా చేశామన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా డీపీటీవో డి.సాంబ్రాజ్యం, ఈడీ నాగేంద్ర ప్రసాద్, ఇన్‌చార్జి డీఎం జె.శ్యామల, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ గ్యారేజిని పరిశీలించి కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.

శాస్త్రోక్తంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



అమరావతి: పవిత్ర శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని స్థానిక అమరేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ రేఖ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలోని దక్షిణాన అమ్మవారిని ప్రత్యేక వేదిక అలంకరించి, ముత్తయిదువులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. తొలుత బాలచాముండేశ్వరీ, జ్వాలాముఖీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కలశ స్థాపన చేసి లక్ష్మీదేవిని ఆవాహన చేశారు. షోడశోపచారాలతో శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి పిండివంటలతో కూడిన వాయినాన్ని నివేదించారు. ముత్తయిదువులు ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


నరసరావుపేటరూరల్: ఇస్సపాలెంలోని మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ కోమిటినేని నాసరయ్య, రాజ్యలక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈవో ఎస్.మాధవీదేవికి విరాళం చెక్‌ను దాతలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు కొత్తలంక కార్తికేయ శర్మ, నండూరి కాళీకృష్ణ పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారికి వెండిపళ్లెం కానుక



తెనాలి: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో గల శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానానికి తెనాలివాసులు రూ.1.50 లక్షల విలువైన కిలోన్నర వెండి పళ్లెంను శుక్రవారం సమర్పించారు. స్థానిక బాలాజీరావుపేటకు చెందిన బొందలపాటి శ్రీకాంత్, గీత, రజనీకాంత్ చౌదరి, అనూష, శివకుమార్, జష్విితాచౌదరి, గవిని శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఈ కానుక సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,026 క్యూసెక్కులు ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.5 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్ కాలువకు 246, బ్యాంక్ కెనాల్‌కు 1,631, తూర్పు కాలువకు 613, పశ్చిమ కాలువకు 250, నిజాపట్నం కాలువకు 407, కొమ్మూరు కాలువకు 2,640 క్యూసెక్కులు, బ్యారేజి నుంచి సముద్రంలోకి 4,16,662 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అడిగినంత ఇస్తే రికవరీలు తగ్గిస్తాం

- సామాజిక తనిఖీల అక్రమాలను కప్పిపుచ్చుతాం
- ఉపాధి హామీలో బంపరాఫర్లు
- ముడుపులు ఎక్కువిస్తే భారీగా రికవరీలు
- ముడుపులు ఇవ్వకపోతే నో రికవరీ
- తలలు పట్టుకుంటున్న కొందరు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు
- డ్వామా అధికారి తీరుపై సర్వత్రా ఆగ్రహం
- కుప్పలు తెప్పలుగా అక్రమాలు వెలుగు చూస్తున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లా ఉపాధి హామీలో అక్రమాల వ్యవహారం నీకింత..నాకింత అనే చందంగా మారింది. ఫేక్ మస్టర్లు, పనిచేయకుండానే బిల్లులతో కొందరు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. జిల్లా అధికారి నేను అడిగినంత ఇస్తే .. అక్రమాలను కప్పిపుచ్చుతానంటూ బేరం పెడుతున్నారు. జిల్లా అధికారి ముడుపులిచ్చిన వారి అక్రమాలను మరుగునపెడుతున్నారు. వాటా ఇవ్వని వారిని రికవరీ పేరుతో బుక్ చేస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఉపాధిలో అక్రమాలు, అవినీతి వ్యవహారం కుప్పలు తెప్పలుగా వెలుగు చూస్తున్నా.. ఉన్నతాధికారులు మాత్రం చర్యలకు మీనమేషాలు లెక్కించడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

అద్దంకి మండలంలో అక్రమాలు వెల్లువ

ఉపాధి హామీ పనుల్లో అద్దంకి మండలంలో జూన్‌లో జరిగిన సామాజిక తనిఖీల్లో ఈ విషయం తేటతెల్లమైనట్లు సమాచారం. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రూ.8,52,33,219 మేర ఉపాధి హామీ పనులు జరగ్గా 336 పనులకు సంబంధించి రూ.82,74,327 మేర పనుల్లో అవినీతి జరిగిందని కమిటీ తేల్చింది. కానీ 124 పనులకు సంబంధించి రూ.29,25,256లు మాత్రమే డీవియేషన్ ఉందని ప్రొసీడింగ్ అధికారి హోదాలో డ్వామా పీడీ అంగీకరించినా... 82 పనులకు చెందిన రూ.1,69,106 మాత్రమే రికవరీ పెట్టినట్లు సమాచారం. మిగిలిన రూ.19.34 లక్షలకు సంబంధించిన పనులను రిఫర్డ్ కింద రాసిన పీవో రూ.8,21,426లకు చెందిన పనులను రెక్టిఫికేషన్, మిగిలిన రూ.53.49 లక్షలకు చెందిన పనుల్లో అవినీతి జరగలేదని డ్రాఫ్ట్ రాశారు.

నగరంలో మాత్రం రూ.48 లక్షల రికవరీ

అద్దంకి, చీరాల మండలాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని 17వ విడత సామాజిక తనిఖీ తేల్చగా దానిని తోసిపుచ్చి మొక్కుబడిగా మాత్రమే రికవరీలు విధించిన డ్వామా అధికారి నగరం మండలంలో జరిగిన అవినీతి విషయంలో భిన్నంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. నగరం మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.9,56,57,239 పనులు జరగ్గా రూ.1,08,60,208 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేల్చారు. రూ.48,01,833 డీవియేషన్ ఉన్నట్లు అంగీకరించిన డ్వామా అధికారి రూ.48,01,833 మొత్తాన్ని పూర్తిగా రికవరీ కింద చూపడం గమనార్హం. నగరం మండలానికి చెందిన కొందరు ఫీల్డ్, టెక్నికల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతోపాటు ఏపీవో ఇతర అధికారులు ముడుపులు చెల్లించేందుకు ససేమిరా అనగా కొందరు మాత్రమే అరకొరగా ముట్టజెప్పడంతో ఆగ్రహించిన జిల్లా అధికారి డీవియేషన్ చూపిన మొత్తాన్ని రికవరీ కింద రాశారన్న ఆరోపణలున్నాయి. ఉపాధి హామీలో పెద్దఎత్తున అక్రమాలు వెలుగు చూస్తున్నా.. ఉన్నతాధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చీరాలలో రూ.48.51 లక్షలకు రూ.1.19 లక్షలే రికవరీ

చీరాల మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.9,16,80,215 పనులు జరగ్గా 246 పనులకు సంబంధించి రూ.48,51,541 మాత్రమే అవినీతి జరిగినట్లు 17వ విడత సామాజిక తనిఖీ తేల్చగా డ్వామా పీడీ మాత్రం రూ.29,30,909 డీవియేషన్ ఉందని అంగీకరించారు. కానీ రూ.1,19,915 మాత్రమే అవినీతి జరిగిందని రికవరీ పెట్టారు. మిగిలిన రూ.21,53,707 మొత్తాన్ని రిఫర్డ్ కింద, రూ.19,20,632 డ్రాఫ్ట్ అమౌంట్‌గా, రూ.6,57,289 మొత్తాన్ని రెక్టిఫికేషన్ కింద చూపి సామాజిక తనిఖీలో తేలిన అవినీతిని మాఫీ చేశారు. అద్దంకి, చీరాల రెండు మండలాల్లో పెద్దమొత్తంలో అవినీతి జరిగిందని సామాజిక తనిఖీ తేల్చగా తక్కువ రికవరీలు చూపడం వెనుక లక్షల్లో డబ్బులు చేతులు మారినట్లు డ్వామాలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఉపాధి అక్రమాలపై విచారణ

- సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ
- త్వరలో కలెక్టర్‌కు నివేదిక

ఉపాధి అక్రమాలపై జిల్లా కలెక్టర్ వెంకట మురళి విచారణకు ఆదేశించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించారు. కమిటీలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, బాపట్ల ఆర్డీవో గ్లోరియా, చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడులను సభ్యులుగా నియమించారు. ఇప్పటికే విచారణ మొదలైనట్లు సమాచారం. త్వరలో కమిటీ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు సమాచారం. ఉపాధి హామీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఫేక్ మస్టర్లతో నిధులు కొల్లగొట్టారని అద్దంకి, బల్లికురవ, నగరం, చీరాల తదితర ప్రాంతాల నుంచి నేరుగా ఫిర్యాదులొచ్చాయి. సాక్షి దినపత్రికలో కథనాలు వెలువడ్డాయి. దీనికి స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

బుధవారం నాటికి నివేదిక

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలపై పలు ఆరోపణలు వచ్చాయి. పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. దీంతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రేపల్లె, బాపట్ల, చీరాల ఆర్డీవోలతో కలిసి విచారణ వేగవంతం చేశాం. వచ్చే బుధవారం నాటికి కలెక్టర్‌కు నివేదికను అందజేస్తాం.

– నాగిరెడ్డి, సంయుక్త కలెక్టర్, బాపట్ల జిల్లా.

బార్ అండ్ రెస్టారెంట్ల అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు



మాట్లాడుతున్న హేమంత్ నాగరాజు

రేపల్లె: ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన బార్ పాలసీకి రేపల్లె పట్టణంలో నాలుగు బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటుకు అనుమతులు లభించాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు చెప్పారు. స్థానిక ప్రొహిబిషన్ కార్యాలయంలో శుక్రవారం రెస్టారెంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపే వారితో సమావేశం నిర్వహించారు. 2025 అక్టోబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు మూడు సంవత్సరాలపాటు బార్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే వారు రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజు, రూ.10,000 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తెలిపారు. బార్లకు అందిన దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సమక్షంలో బాపట్లలో లాటరీ విధానంలో ఎంపిక చేస్తారని తెలిపారు. బార్ పాలసీ విధి విధానాలను తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు, సీఐ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల తిప్పలు

- రీ వెరిఫికేషన్‌కు హాజరుకావాలంటూ నోటీసులు
- సవాలక్ష కారణాలతో వెనక్కి పంపుతున్న సిబ్బంది
- ప్రభుత్వం, అధికారుల తీరుపై మండిపడుతున్న దివ్యాంగులు



రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో వేచి ఉన్న దివ్యాంగులు



నిరాశగా వెనుదిరుగుతున్న బందెల ముసలయ్య

రేపల్లె: ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేస్తుంది. ఏ పని చేసుకోలేని కదలలేని స్థితిలో ఉన్న దివ్యాంగుల పింఛన్లు తొలగించాలనే కుట్రతో ప్రభుత్వం ఇటీవల బాపట్ల జిల్లాలో 3829 మంది పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేసింది. సదరం క్యాంపునకు వెళ్లి వికలాంగుల శాతాన్ని ధృవీకరించే సర్టిఫికెట్ పొందాలని నోటీసులో పేర్కొంది. కదలలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు అష్ట కష్టాలు పడుతూ తమకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన క్యాంపునకు హాజరైతే మీకు ఇక్కడ చూడడం కుదరదని సదరం క్యాంపు సిబ్బంది తెలియజేస్తున్నారు. దీంతో వికలాంగులు నిరాశగా వెనుక తిరుగుతున్నారు. మాకు ఇచ్చిన షెడ్యూల్లో ఇదే హాస్పిటల్ ఈ రోజే హాజరు కావాలని ఉంది కదా సార్ అని దివ్యాంగులు అడిగితే రిపీట్ డాక్టర్ చూడకూడదు సాంకేతిక లోపాల కారణంగా మండల పరిషత్ అధికారులు మీ షెడ్యూల్ ఖరారు చేశారు, వెళ్లి వారిని కలవండి మరలా షెడ్యూల్ ఇస్తారంటూ సమాధానం చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో దివ్యాంగులు వెనుదిరుగుతున్నారు. రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం జరిగిన సదరం క్యాంపునకు రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలోని వివిధ గ్రామాల నుంచి 45 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వారిలో ఆరుగురు దివ్యాంగులకు రిపీట్ డాక్టర్ కారణాలు చెబుతూ తిప్పి పంపడంతో నిరాశగా వెనుదిరిగారు. దివ్యాంగులమని చూడకుండా ఇష్టానుసారంగా తిప్పుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన బందెల ముసలయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. 30 కిలోమీటర్ల దూరం నుంచి వస్తే తమ షెడ్యూల్ ఇది కాదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కొన్నేళ్లుగా పింఛన్ పొందుతున్నానని 80 శాతం వికలాంగత్వం ఉన్నా రీ వెరిఫికేషన్ చేయించుకోవాలని నోటీస్ ఇవ్వడంతో తప్పక ఇక్కడికి వచ్చానన్నారు. వెరిఫికేషన్ కాకపోతే పింఛన్ రాదని అధికారులు చెబుతున్నారని తనకు పింఛన్ వస్తుందా లేదా అని బాధ వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, అధికారులు ఏ ఆధారం లేని దివ్యాంగులను ఇబ్బందులు గురి చేయకుండా సమస్యను పరిష్కరించాలని వేడుకున్నాడు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతుల కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెరిఫికేషన్‌లో తొలగించిన వికలాంగుల పింఛన్‌దారులకు మరో అవకాశం కల్పిస్తామన్నారు. విభిన్న ప్రతిభావంతులు పెన్షన్ల కోసం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల దగ్గర అప్పీల్ చేసుకోవచ్చన్నారు. విభిన్న ప్రతిభావంతులకు తిరిగి వెరిఫికేషన్ ద్వారా పింఛన్లు మంజూరు అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధామాధవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వేగం పెంచండి

జిల్లాలో స్వామిత్వ సర్వేపై కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పనులను వేగవంతం చేయాలని, పూర్తయిన గ్రామాల్లో హక్కు పత్రాలను త్వరితగతిన పంపిణీ చేయాలని ఆదేశించారు. సర్వేలో తలెత్తే వివాదాలు, అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రజలకు తమ ఆస్తులపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని, తద్వారా వారు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందవచ్చని కలెక్టర్ వివరించారు. పంచాయతీలకు సొంత ఆదాయాన్ని పెంచుతుందని తెలిపారు. సమావేశంలో సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ కనకప్రసాద్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియ, చంద్రశేఖర్, రామలక్ష్మి, డీపీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలు, సాధించిన పురోగతి నిక్షిప్తం చేయాలి

అభివృద్ధి లక్ష్యాలు, సాధించిన పురోగతిపై ఎప్పటికప్పుడు కేపీఐసీలో నిక్షిప్తం చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలని చెప్పారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో వెయ్యి మొక్కలు నాటాలని కలెక్టర్ తెలిపారు. అటవీ శాఖ అధికారులు, డ్వామా అధికారులు సమన్వయంతో మొక్కలు నాటాలని సూచించారు. సమావేశంలో సీపీఓ షాలేమ్ రాజు, డీపీఓ ప్రభాకరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలమట్టం పెరిగేలా ప్రణాళికలు తయారు చేయాలి

భూగర్భ జల మట్టం జిల్లాలో మరింత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి ఆదేశించారు. జల వనరులు, భూగర్భ జలశాఖ అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రానైట్ క్వారీలు, మట్టి, కంకర తవ్వకాల ప్రభావంతో పర్యావరణం సమతుల్యత కోల్పోయి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. వాటిని పెంచడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోని మండలాలలో పంట కాల్వల మధ్యలో బోర్లు వేసి భూగర్భ జలాలు పెరగడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కొల్లూరు మండలంలోనూ భూగర్భ జలమట్టం తగ్గడంపై ఆరా తీశారు. ఇసుక తవ్వకాలతో భూగర్భ జలమట్టం తగ్గుతుందని ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వాటిని అరికడుతూనే భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాపట్ల పట్టణం తాగునీటి చెరువు కట్ట బలోపేతం, పూడికతీత పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రూ.ఎనిమిది కోట్ల నిధులతో తయారుచేసిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి తక్షణమే పంపాలన్నారు. సమావేశంలో జల వనరులశాఖ ఎస్ఈ అబూతలీమ్, భూగర్భ జల శాఖ ఏడీ సురేష్, డ్వామా పీడీ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన కృష్ణమ్మ

ఊపిరి పీల్చుకుంటున్న లంక గ్రామాల రైతులు



భట్టిప్రోలు మండలం ఓలేరు-పెసర్లంక వద్ద చప్టాపై తగ్గిన వరద నీరు

భట్టిప్రోలు: కృష్ణమ్మ శాంతించింది. దీంతో లంక గ్రామాల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద దిగువకు శుక్రవారం మధ్యాహ్నం 4.32 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. మండలంలోని ఓలేరు, పల్లెపాలెం, పెద లంక కాకుల డొంక వద్ద వరద తగ్గుముఖం పట్టింది. పొలాల్లో నిలిచిన నీరు వెనక్కి వెళుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు చర్యలు చేపట్టారు. చప్టాలపై నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను, నాటు పడవలను అందుబాటులో ఉంచారు. వీఆర్వోలు, ఇన్‌చార్జి ఆర్‌ఐ శివరామకృష్ణ, మండ్రు జక్రయ్య, ఎల్.సురేష్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు.

నీరందక ఎండుతున్న పంటలు

- వరదలతో నిండుకుండలా కృష్ణమ్మ
- కాలువలకు విడుదల కాని నీరు
- మోటార్లతో పొలాలకు నీరు
- రైతులపై అదనపు భారం



మైనేనివారిపాలెం సమీపంలో నీరు లేక ఎండిపోతున్న వెద సాగు



పోటుమెరక సమీపంలో మోటర్ ద్వారా నీరు పెడుతున్న దృశ్యం

రేపల్లె: కృష్ణా పరీవాహక ప్రాంతంలోని పంట పొలాలను వరదలు ముంచెత్తుతుండగా..మరో వైపు నీరు అందక వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంట ఎండిపోతుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రేపల్లె నియోజకవర్గం పరిధిలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలలో 85 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుంటారు. వెద పద్ధతిలో ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. కాలువలకు నీరు విడుదల చేయలేదు. దీంతో పంటలకు నీరు అందకపోవటంతో ఎండిపోతున్నాయి. చివరకు ఇంజిన్ల ద్వారా నీరు పెడుతున్నారు. తక్కువ ఖర్చు అవుతుందని వెద పద్ధతిలో సాగు చేస్తే చివరకు తడిసిమోపెడు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని పెనుమూడి, చాటగడ్డ, మైనేనివారిపాలెం, బోడాయపాలెం, కై తేపల్లి, పోటుమేరక, నగరం, ఈదుపల్లి, పెద్దమట్టపూడి, చిన్నమట్లపూడి, సిరిపుడి, ముత్తుపల్లి, ఆరేపల్లి తదితర గ్రామాలలో ఇప్పటికే సాగు చేస్తున్న పంట ఎండుముఖం పట్టడంతో రైతులు విలవిలలాడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలకు నీరు విడుదల చేసి పంటను కాపాడాలని కోరుతున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,400

మోడల్ ధర రూ. 2,800

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,538
అమ్మకాలు	49,099
నిల్వ	7,830

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–13,500
నంబరు–5	10,000–13,200
273	10,000–13,000
341	10,000–14,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,800
నంబరు–5	10,000–13,500
341	11,000–15,000
4884	10,000–13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,500
బాడిగ–355	10,000 – 14,000
దేవనూరు డీలక్స్	10,000 – 13,500
ఆర్మూర్	9,800 – 11,500
తాలుకాయలు	6,000 – 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,500
బాడిగ – 355	10,000–13,500
దేవనూరు డీలక్స్	10,500–13,600
తాలు	5,300 – 7,200

–కొరిటిపాడు (గుంటూరు)

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు

నెహ్రూనగర్: దివ్యాంగ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్కాలర్‌షిప్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తుందని అర్హులైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోపు https://scholarships.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అక్రమార్కులకు అడ్డా తహసీల్దార్ కార్యాలయం

- ప్రభుత్వ భూమికి సంబంధించి మూడు పొజిషన్ సర్టిఫికెట్లు
- అటవీ భూములకూ పాస్ పుస్తకాలు మంజూరు
- సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు అడిగినా నో..



మార్టూరు తహసీల్దార్ కార్యాలయం

మార్టూరు: మార్టూరు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తికి చెందిన ఇంట్లో ముగ్గురి పేరుతో ప్రభుత్వ భూమికి సంబంధించి మూడు పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంలో సుమారు రెండు లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆ పార్టీ నాయకులే మీడియాకు వివరాలు అందజేయడం గమనార్హం. ఇదే విషయాన్ని విలేకరులు అధికారిని వివరణ కోరగా తాను డబ్బు తీసుకోలేదని చెప్పారు. కానీ ఆ తర్వాత అదే విలేకరికి ఫోన్ చేసి తాను పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చిన పట్టా నకలు తనకు వాట్సాప్ ద్వారా పంపమని కోరడం గమనార్హం.

ఫారెస్ట్ అధికారుల ఆదేశాలు బేఖాతర్

బబ్బేపల్లి కొండ.. రెవెన్యూ పరిధి నుంచి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి వచ్చిందని సదరు భూమిలో ఎలాంటి ఆక్రమణలు కానీ, తవ్వకాలు కానీ జరపవద్దని జిల్లా ఫారెస్ట్ అధికారులు ఎల్.భీమన్న, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్‌బాబు గత సంవత్సర కాలంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అయితే బబ్బేపల్లి శివారు గ్రామమైన రాజుగారిపాలెం గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడి కుమార్తె పేరుపై ఈ ఫారెస్ట్ భూమిలో ఓ ఎకరాకు పాస్ బుక్ మంజూరు చేయడం గమనార్హం.

తోటి అధికారులకు తెలియకుండా..

భూ సంతర్పణలకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా కొందరు వివరాలు అడగగా నేటికీ సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో పది కోట్ల రూపాయల విలువైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రస్తుతం ఓ అధికార పార్టీకి చెందిన నాయకుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది.

ఫారెస్ట్ భూమిపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనం సాగదు

బబ్బేపల్లి రాజుగారిపాలెం గ్రామం ఫారెస్ట్ భూములను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకోవడంపై పలుమార్లు హెచ్చరించాం. రెవెన్యూ అధికారులకు ఈ భూమిలో పట్టాలు పాస్ పుస్తకాలు ఇచ్చే అధికారం లేదు. ఫారెస్ట్ భూమిని ఆక్రమించుకున్నా, అనధికార నిర్మాణాలు చేపట్టినా తగు చర్యలు తీసుకుంటాం.

–రమేష్, కూకట్లపల్లి రేంజ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

సాక్షి చీరాల విలేకరి మురళి ఆకస్మిక మృతి



కడియం మురళి

చీరాల అర్బన్: సాక్షి దినపత్రిక బాపట్ల జిల్లా చీరాల విలేకరి కడియం మురళి(51) శుక్రవారం ఉదయం మృతి చెందారు. కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రెండు రోజుల కిందట గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం ఉదయం మృతిచెందారు. పత్రికా రంగంలో సుదీర్ఘకాలం పాటు జర్నలిస్టుగా ఆయన పనిచేశారు. సాక్షి దినపత్రిక చీరాల ఆర్‌సీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. అలానే ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన భౌతికకాయాన్ని చీరాలలోని జర్నలిస్టులు పట్టణంలో ర్యాలీగా స్థానిక హరిప్రసాద్‌నగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిలు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామన్నారు. చీరాల నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, రాజకీయపార్టీల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



మృతుడు వెంకటేశ్వర్లు

అద్దంకి: పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన మన్నేటి వెంకటేశ్వర్లు(40) ఉదయాన్నే మేత కోసం పొలం వెళ్లాడు. మేత కోసే సమయంలో అక్కడున్న పాము కాటు వేయడంతో మోటారు బైక్‌పై ఇంటికి వచ్చి విషయం భార్యతో చెప్పి వైద్యశాలకు స్వయంగా బండి నడుపుకుంటూ వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాటు వేసిన పాము రక్తపింజర అయి ఉండవచ్చని స్థానికులు, వైద్యులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వెంకటేశ్వర్లు మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

కదులుతున్న రైలుపైకి భార్యను నెట్టిన భర్త

- తీవ్ర గాయాలతో స్పృహ తప్పిన బాధితురాలు
- ఆసుపత్రికి తరలింపు



స్పృహతప్పిన అంజలి

తాడేపల్లిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను రన్నింగ్‌లో ఉన్న ట్రైన్‌పైకి తోసివేసిన ఘటన శుక్రవారం తాడేపల్లి గేటు సెంటర్‌లో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... నూజివీడుకు చెందిన వెంకటేశ్వరరావు, అతని భార్య అంజలి కొంతకాలంగా తాడేపల్లిలో నివసిస్తున్నారు. నాలుగేళ్ల కిందట విడాకులు తీసుకుని వేర్వేరుగా ఉంటున్నారు. ఇటీవల కలసి జీవనం కొనసాగిస్తున్నారు. అంజలి తాడేపల్లి సలాం సెంటర్ నుంచి శుక్రవారం ఉదయం బైపాస్‌రోడ్‌లో ఉన్న ఓ హోటల్‌లో పని చేసేందుకు వెళుతోంది. గేటు సమీపంలో భర్త వెంకటేశ్వరరావు తారస పడ్డాడు. అదే సమయంలో రైలు వెళుతుండగా భర్త ఆమె జుట్టు పట్టుకుని వేగంగా వెళుతున్న రైలు మీదకు నెట్టాడు. రైలు ఢీకొనడంతో అంజలి తీవ్ర గాయాలతో అక్కడే కుప్పకూలిపోయింది. స్థానికులు 108కు ఫోన్‌చేసి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పారిపోతున్న వెంకటేశ్వరరావును పట్టుకుని తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్

రూ. 16 లక్షలకు పైగా సొత్తు స్వాధీనం



బల్లికురవలో చోరీ సొత్తుపై వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

బల్లికురవ: పథకం ప్రకారం నివాస గృహాల్లో బంగారం, వెండి బైక్‌లు చోరీకి పాల్పడ్డ అంతర్ జిల్లాల దొంగను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలో బల్లికురవ మండలంలోని గొర్రెపాడు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించి పట్టుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలియజేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కత్తి రవి కుమార్ 18వ సంవత్సరం నుంచే చెడు వ్యవసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతూ జైలుకు వెళ్లడం, బెయిల్‌పై రావటం.. మరలా చోరీలకు పాల్పడటం చేస్తున్నాడు. ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని రామాంజనేయపురంలో గుంటుపల్లి గురుమూర్తి ఇంట్లోకి ప్రవేశించి 32 గ్రాముల బంగారం, 30 తులాల వెండి చోరీకి పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని సంతమాగులూరు సీఐ వెంకటరావు, ఎస్సై వై నాగరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు. బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు పర్యవేక్షణలో సీఐ సారథ్యంలో బల్లికురవ, సంతమాగులూరు ఎస్సైలు నాగరాజు, పట్టాభిరామయ్య రెండు టీంలుగా పక్కా వ్యూహంతో ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల, పల్నాడు, తూర్పు గోదావరి, కర్నూలు జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. 102 గ్రాముల బంగారం, 230 గ్రాముల వెండి, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. బల్లికురవ, పల్నాడు జిల్లా నాదెండ్ల, దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి రికవరీ చేసినట్లు వివరించారు. విశేష ప్రతిభతో నిందితుడిని అదుపులోకి తీసుకుని రికవరీ చేయటం పట్ల బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ, డీఎస్పీ రామాంజనేయులు, సీఐ వెంకటరావు, ఎస్సైలు వై.నాగరాజు పట్టాభిరామయ్యను అభినందించి రివార్డులు ప్రకటించారు.

అసెస్‌మెంట్ బుక్స్ విధానాన్ని రద్దు చేయాలి

డీఈవో కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తెచ్చిన అసెస్‌మెంట్ బుక్స్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు మాట్లాడుతూ.. ఈ విధానం కారణంగా విద్యార్థులు 50 నుంచి 70 గంటల బోధనా పీరియడ్స్ నష్టపోతున్నారని, ఆగస్టు నెలలో సిలబస్ పూర్తవ్వకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఈ విధానం తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ఒకటో తరగతి విద్యార్థికి ఓఎంఆర్ షీట్ ఇవ్వడం పనికి రాని చర్య అన్నారు. ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాల నుంచి ఒక్క ప్రశ్న సైతం ఇవ్వకుండా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తురని పేర్కొన్నారు. ఒక్కో పరీక్షకు ఎనిమిది పేపర్లతో ప్రశ్నపత్రాలను సిద్ధం చేయడం చేయడం ఉపాధ్యాయులకు పెద్ద పరీక్షలా ఉందన్నారు. విద్యార్థుల మార్కులు ఐదు చోట్ల నమోదు చేయాలనడం తగదన్నారు. అనంతరం డీఈవో సీవీ రేణుక, ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు పి.లక్ష్మీనారాయణ, పి.పార్వతి, ఎస్ఎస్ఎన్ మూర్తి, జి.దాస్, బి.సాయిలక్ష్మి, వెంకటేశ్వరావు, కిషోర్ షా, రాంమోహన్, శివరామకృష్ణ, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏబీసీ దాటేదెలా? ప్రయాణం సాగేదెలా?



అద్దంకి బ్రాంచ్ కాల్వను దాటే చోట నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి



డైవర్షన్ రోడ్డును తొలగిస్తున్న దృశ్యం

- బ్రిడ్జి నిర్మాణంతో అద్దంకి రోడ్డులో నిలిచిన రాకపోకలు
- 40 రోజులపాటు కొనసాగనున్న పనులు
- డైవర్షన్ రోడ్డు మూసివేసిన కాంట్రాక్టర్
- సాగర్ కాలువకు నీటి విడుదల సమయంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్
- వ్యయప్రయాసలకు గురౌతున్న రైతులు, వాహన చోదకులు

బల్లికురవ: కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులు శాపంగా మారింది. వంతెన నిర్మాణం పేరుతో ప్రజలను అవస్థలకు గురి చేస్తున్నారు. బల్లికురవ–అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్డులో వారం రోజులుగా రాకపోకలు స్తంభించిపోయాయి. వల్లాపల్లి–ధర్మవరం గ్రామాల మధ్య అద్దంకి బ్రాంచ్ కాలువ దాటే చోట శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం రెండు నెలల కిందట చేపట్టారు. నిర్మాణ పనుల్లో భాగంగా ఏబీసీకి నీరు నిలుపుదల చేయాలని ఆర్‌ అండ్‌బీ అధికారులు ఎన్నెస్పీ అధికారులకు విన్నవించారు. అయితే ఆగస్టు 1వ తేదీ ప్రవాహ ఉధృతికి నీరు దిగువకు రావటంతో పనులకు ఆటంకం ఏర్పడింది.

బంకమట్టితో డైవర్షన్ రోడ్డు..

ఏబీసీ కాలువల్లోని బంకమట్టితో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ రోడ్డులోనే గ్రానైట్ లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు జారుడు బల్లలా మారింది. ఈ సమస్యపై పత్రికల్లో కథనాలు వచ్చినా.. సమస్య పరిష్కరించకపోగా.. డైవర్షన్ రోడ్డును పూర్తిగా తొలగించారు. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. బల్లికురవ మండలంలో 12 గ్రామాలు, సంతమాగులూరు మండలంలోని 10 గ్రామాలు, అద్దంకి మండలంలోని 9 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

20 కిలోమీటర్ల అదనపు ప్రయాణం

ఈ సమస్య వల్ల అద్దంకి ప్రాంతవాసులు కొమ్మినేనివారి పాలెం, వైదన, కొమ్మాలపాడు మీదుగా నరసరావుపేట వైపు వెళ్లాల్సి వస్తోంది. సుమారు 20 కిలోమీటర్ల అదనపు ప్రయాణం చేస్తున్నారు. బల్లికురవ, సంతమాగులూరు మండల వాసులు అద్దంకి చేరాలంటే కొమ్మాలపాడు, కొప్పరపాడు మీదుగా 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది.

40 రోజులపాటు అవస్థలే..

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కప్పు దశకు చేరాయి. దీంతోపాటు క్యూరింగ్ పూర్తి కావాలంటే మరో 40 రోజులు పట్టే అవకాశం ఉంది. వ్యవసాయ పనులకు కూలీలను తీసుకెళ్లాలన్నా పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలన్నా ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వివరించారు. వేసవికాలంలో చేపట్టాల్సిన బ్రిడ్జి నిర్మాణ పనులు వ్యవసాయ పనుల సీజన్‌లో చేపట్టారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నీటి విడుదల సమయంలో పనులా?



వేసవికాలంలో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. సాగర్ కాలువకు నీటి విడుదల చేసే సమయంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి అందరిని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. సక్రమంగా రాకపోకలు జరగాలంటే 40 రోజులు పడుతుంది. కనీసం బైకులు, బాటసారులు, రైతులు వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగించేలా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

–దేవినేని కృష్ణబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

నగదు కోసం యాచకుడి హత్య

నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: నగదు కోసం యాచకుడైన వృద్ధుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ ఎస్. రమేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాచకుడు వెంకటనారాయణ(70) జూన్ 8న రాత్రివేళ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం హత్యకు గురైనట్లు నిర్ధారించి, కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా దర్యాప్తు చేపట్టారు. అవనిగడ్డ మండలం లంకమాన్యం ప్రాంతానికి చెందిన నిందితుడు కొల్లి రాజేష్‌ను అరెస్టు చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని సాయిబాబా గుడి వెనుక ఓ టింబర్ డిపో వద్ద నిద్రించిన వృద్ధుడి వద్ద రూ.3 వేల నగదు ఉంది. ఈ విషయం గమనించిన రాజేష్ అతడిపై దాడి చేసి హతమార్చి నగదుతో పారిపోయాడు. దీంతో అతడిని అరెస్టు చేశారు. సమావేశంలో ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా, కానిస్టేబుళ్లు మురళి, జయకర్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ టోర్నీ విజేతగా 'ఆంధ్రా గ్రీన్'



విజేతగా నిలిచిన ఆంధ్రా గ్రీన్ జట్టు సభ్యులు

గుంటూరువెస్ట్ (క్రీడలు): ఏపీ రాష్ట్ర అంధుల క్రికెట్ జట్టు కోసం గత మూడు రోజులుగా స్థానిక అరండల్‌పేటలోని ఏసీఏ క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఏపీ, విజువల్లీ బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, డిఫరెంట్ డిసేబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతగా ఆంధ్రా గ్రీన్స్ జట్టు నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన 42 మందిని ఎంపిక చేసి ఆంధ్రా బ్లూ, ఆంధ్రా ఎల్లో, ఆంధ్రా గ్రీన్ పేరుతో పోటీలు నిర్వహించారు. ఆంధ్రా గ్రీన్ విజేతగా నిలిచింది. వీసీఈఏ అధ్యక్షుడు జి.రవీంద్రబాబు ముఖ్యఅతిథిగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో క్రికెట్‌కు అండగా నిలుస్తున్న రామకృష్ణ పరమహంస, మోటివేషనల్ స్పీకర్ శ్రీధర్‌బాబు, మాజీ బ్లైండ్ క్రికెటర్, అర్జున అవార్డు గ్రహీత అజయ్‌కుమార్ రెడ్డి విజేతలకు ట్రోఫీని అందించారు. అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రికెటర్లను ప్రోత్సహించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.